


సువర్ణసౌధ ప్రాంగణంలో ఆవిష్కరించిన బాపూజీ విగ్రహం

గాంధీజీ తుదిశ్వాసలో హేరామ్ అన్నారు ..
● హిందూ వ్యతిరేకి అనడం సరి కాదు
● బీజేపీపై సీఎం ధ్వజం 7


ప్రసంగిస్తున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

ప్రపంచం మెచ్చిన మహాత్ముడు..!


పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు

● జాతిపిత ఆశయాలు చిరస్మరణీయం
● త్యాగం అంటే ఇందిరాగాంధీ కుటుంబానిదే ● నేడు అటువంటి నాయకులు లేరు: ఖర్గే
● పన్నులన్నీ అంబానీ, అదానీల జేబుల్లోకి ● పేదలపై ప్రేమ లేని బీజేపీ: ఎంపీ ప్రియాంక

బెంగళూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): భారత జాతిపిత గాంధీజీని ప్రపంచం అంతా మెచ్చుకుంటుందని, ఆయన ఆశయాలు చిరస్మరణీయమని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. మంగళవారం బెళగావి సీపీఎడ్ మైదానంలో గాంధీ భారత్ సమావేశంలో కార్యకర్తలు, అభిమానులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వందేళ్లక్రితమే అస్పృశ్యత నివారణ, మహిళా సాధికారత కోసం కృషి చేసిన ఘనత గాంధీజీదన్నారు. ఆయన వారసత్వం అందుకున్న ఇందిరా గాంధీ కుటుంబం గొప్పదన్నారు. దేశంలో రాజకీయత్యాగం అంటే ఇందిరాగాంధీ కుటుంబానిదేనని ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, సోనియాగాంధీలు నిజమైన త్యాగం చేశారన్నారు. అటువంటి వారు ప్రస్తుత రాజకీయ నాయకుల్లో లేరని అసంతృప్తి వ్యక్తం చేశారు. 2004లో సోనియాగాంధీ ప్రధాని అయ్యే అవకాశం ఉండేదన్నారు. కానీ ఆమె పదవికి త్యాగం చేశారన్నారు. దేశాభివృద్ధి కోసం సోనియాగాంధీ ప్రధాని హోదాను ఆర్థిక నిపుణుడు మన్మోహన్‌సింగ్‌కు ఇచ్చారన్నారు. అటువంటి కుటుంబాన్ని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, ప్రధాని మోదీ, అమిత్‌షాలతోపాటు వారి అనుచరులు విమర్శిస్తారన్నారు. గాంధీజీ, అంబేడ్కర్‌లు ప్రపంచానికి తెలుసునన్నారు. చరిత్ర తెలియనివారు కేంద్రంలో కూర్చున్నారని ఖర్గే మండిపడ్డారు. పేదలకోసం ఆహారభద్రత, ఉచిత పథకాలు బీజేపీ అమలు చేయదన్నారు. కాంగ్రెస్ పార్టీ నిరంతరంగా పేదలకోసమే పనిచేసిందన్నారు. ఇందిరాగాంధీ పేదలకోసం పది అంశాల కార్యక్రమం తీసుకొచ్చారన్నారు. అయినా ఎన్డీయే తమ పట్ల తప్పుడు ప్రచారం చేస్తుందన్నారు. ఇందిరాగాంధీ నుంచి సోనియాగాంధీ దాకా కుటుంబం త్యాగం చేసినవారిని అటువంటి మనఃస్థితి కల్గిన రాజకీయ నాయకులు ప్రస్తుతం లేరన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ దళితులు, రైతుల గురించి ఆలోచించరన్నారు. రైతులకు సాయంతోపాటు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. కానీ ఆ ప్రయత్నమే చేయడం లేదన్నారు. గాంధీజీ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని వహించిన వందేళ్ల తర్వాత తనకు దక్కడం గర్వంగా ఉందన్నారు. దేశంలోనే కర్ణాటకలో కాంగ్రెస్ శక్తివంతంగా ఉందని, మంచి పాలన, ఉత్తమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మాకు కిత్తూరు రాణి చన్నమ్మ, ఝాన్సీరాణిలు ఎవరంటే ప్రియాంక గాంధీ అంటూ వర్ణించారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లపై పోరాడేశక్తి ప్రియాంకగాంధీకి ఉందన్నారు.


రాజ్యాంగ పుస్తకావిష్కరణలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ సుర్జేవాలా, సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివ కుమార్ తదితరులు

రాజ్యాంగం అంటే రక్షణ కవచం : ప్రియాంక

రాజ్యాంగం అంటే కేవలం పుస్తకం కాదని మనందరినీ కాపాడే రక్షణ కవచమని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, ఎంపీ ప్రియాంకగాంధీ పేర్కొన్నారు. బెళగావి సభలో కార్యకర్తలను ఉద్దేశించి కన్నడభాషలో ప్రసంగాన్ని ప్రారంభించారు. మాట్లాడేంతసేపు రాజ్యాంగాన్ని చూపుతూ అభివాదం చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలిచ్చిన చరిత్ర మనదని, బ్రిటీష్‌వారికి క్షమాపణ లేఖ రాసిన వారు కాదని రాజ్యాంగం, ప్రజాస్వామ్య మనుగడకు ప్రాణాలు ఇచ్చేందుకు మేం సిద్ధమని దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని మాతో కలసి మీరు పోరాట సంకల్పంతో సిద్ధంగా ఉండాలన్నారు. మన రక్షణా కవచం రాజ్యాంగాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అవమానం చేశారన్నారు. ఇటువంటి ప్రభుత్వం, మంత్రిని గతంలో చూడలేదన్నారు. రాజ్యాంగం, అంబేడ్కర్‌కు అవమానాన్ని సహించరాదని, ప్రాణత్యాగ సంకల్పానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశంలో రైతులు సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నారని, కేవలం లక్ష రూపాయల అప్పు కోసం ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. నిత్యావసరాలైన టూత్‌పేస్ట్, కాఫీ పొడి, టీ, బ్రెడ్, యూనిఫాం, పుస్తకాలు, పెన్నులు వంటివాటిపైనా జీఎస్టీ విధించారన్నారు. అదాని, అంబానీలకు ట్యాక్స్‌లు పోతున్నాయన్నారు. శ్రీమంతులకు 17 లక్షల కోట్ల రుణమాఫీ చేశారని మండిపడ్డారు. 2024 ఎన్నికల్లో పలు చోట్ల రాజ్యాంగ మార్పు చేస్తామని చెప్పారన్నారు. దేశ మూల సిద్ధాంతాలు, ఆశయాలు సమైక్యతపై దాడి చేసే కుట్ర సాగుతోందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. తొలిసారి నరేంద్రమోదీ ప్రధాని అయినప్పుడు రాజ్యాంగంపై విమర్శలు చేశారని, రిజర్వేషన్లు, ఆర్‌టీఐకు వారు వ్యతిరేకమన్నారు. లోక్‌పాల్ చట్టం, ఎన్నికల కమిషన్ శక్తి నిర్వీర్యం చేశారన్నారు. కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తున్నారన్నారు.



రాజ్యాంగ వ్యతిరేకి ఆర్‌ఎస్‌ఎస్: సీఎం



రాజ్యాంగం అంటే ఆర్‌ఎస్‌ఎస్‌కు వ్యతిరేమని, దానినే బీజేపీ దేశంపై రుద్దుతోందని తిప్పికొట్టేందుకు సిద్ధం అవుదామని సీఎం సిద్దరామయ్య పిలుపునిచ్చారు. బీజేపీ పరివారంలో దేశంలో వర్గవిబేధాలు సృష్టించేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. భాష, కులాలు, మతాలన్నీ కలిపితేనే భారత్‌శక్తి అన్నారు. బీజేపీ అంబేడ్కర్‌ను వ్యతిరేకిస్తుందన్నారు. మనం రాజ్యాంగాన్ని రక్షిస్తేనే అది మనల్ని కాపాడుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. ఎన్నికల్లో విజయం కంటే సిద్ధాంతం గెలుపు ముఖ్యమన్నారు. రాజ్యాంగం అమలైనప్పుడు అంబేడ్కర్ చిత్రపటానికి, రాజ్యాంగాన్ని బీజేపీవారు కాల్చారన్నారు. ఇది దేశప్రజలు ఎన్నడూ మరువరన్నారు. గాంధీజీ, అంబేడ్కర్ ఆశయాలు, నైతిక విలువలకు ప్రాధాన్యం ఇద్దామని భావితరాలకు అందించేలా పటుపడదామని పిలుపునిచ్చారు. గాంధీజీ, అంబేడ్కర్ ఆశయలు అమలు చేసేందుకు బడ్జెట్‌లో రూ.52వేల కోట్లను గ్యారెంటీ పథకాల రూపంలో విడుదల చేశామన్నారు.

అనారోగ్యంతో రాహుల్ దూరం

అనారోగ్యంతో సోదరుడు రాహుల్‌గాంధీ సమావేశానికి రాలేకపోయారన్నారు. దేశం కోసం రాహుల్ ప్రతిక్షణం పోరాడుతున్నారన్నారు. రాహుల్ రాజ్యాంగ పరంగా మాట్లాడేందుకు అడ్డుకుంటున్నారన్నారు. అధికారంలో ఉండే బీజేపీకి రాహుల్ అంటే భయమన్నారు. రాహుల్ వాస్తవాలు మాట్లాడతారన్నారు. అందుకే రాహుల్‌పై వందలాది కేసులు వేశారన్నారు. మల్లికార్జున ఖర్గేతోపాటు మేమెవ్వరూ భయపడేది లేదని, ఎందుకటే సత్యం, ధర్మంవైపు ఉన్నామన్నారు. రాజ్యాంగమే మా సిద్ధాంతమన్నారు. సమానత్వం, ప్రజాప్రభుత్వంకోసం నా జీవితం త్యాగం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

సువర్ణసౌధలో అనుభవమండప రూపకం

సువర్ణసౌధ ప్రాంగణంలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన తర్వాత లోపలిభాగంలో అనుభవమంటపం రూపకాన్ని ఆవిష్కరించారు. సువర్ణసౌధలోని అసెంబ్లీలో గాంధీ, నెహ్రూ, బసవణ్ణ చిత్రపటాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంత్రులు సతీశ్ జార్కిహొళి, హెచ్‌కే పాటిల్, పరమేశ్వర్‌తోపాటు మంత్రులు, ఎంపీలంతా భాగస్వామ్యులయ్యారు. డిసెంబరులో జరిగిన సభకు జాతీయస్థాయి నాయకులతోపాటు అన్ని రాష్ట్రాల కాంగ్రెస్ ప్రముఖులు, కాంగ్రెస్ సీఎంలు పాల్గొన్నారు. కాగా ప్రియాంకగాంధీని స్వాగతించేందుకు సీఎం సిద్దరామయ్య విమానాశ్రయానికి వెళ్లడాన్ని బీజేపీ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఒక ఎంపీని స్వాగతించేందుకు సీఎం వెళ్లడం ఎంతవరకు సమంజసమన్నారు. బీజేపీ ఎమ్మెల్యే ఎస్‌టీ సోమశేఖర్ హాజరు కావడం చర్చనీయాంశమైంది. ఎస్‌టీ సోమశేఖర్ మాట్లాడుతూ గాంధీ పట్ల అభిమానంతో వచ్చానన్నారు. బీజేపీ నాయకులు పాల్గొనాల్సి ఉండేదన్నారు.


సమావేశానికి హాజరైన కార్యకర్తలు

మహాత్మాగాంధీ భారత్ ఆత్మ : డీసీఎం

మహాత్మాగాంధీ భారత్‌కు ఆత్మ అని ప్రపంచానికి శాంతి, సమానత్వం సూచించిన పరమాత్ముడని, నాడు, నేడు, రేపు మాది గాంధీ మంత్రమని డీసీఎం డీకే శివకుమార్ అభిప్రాయపడ్డారు. వందేళ్ల క్రిందట ఇదే ప్రాంతంలో మహాత్మాగాంధీ అధ్యక్షతన కాంగ్రెస్ సభ జరిగిందని, చారిత్రాత్మకమైన సభకు గాంధీ భారత్ పేరు పెట్టామన్నారు. వేలాదిమంది గాంధీ అభిమానులు తరలిరావడం సంతోషంగా ఉందన్నారు. వేదికకు జై బాపు, జై భీమ్, జై రాజ్యాంగం అంటూ వర్ణించామన్నారు. దేశ ప్రజల ఐక్యత, సమగ్రతకు గాంధీజీ, అన్ని వర్గాలకు హక్కులు కల్పించేలా అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవిలో గాంధీ, నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలు కూర్చున్న స్థానంలో కన్నడ వరపుత్రుడు ఖర్గే ఉన్నారని కొనియాడారు. మన హృదయంలో రాజ్యాంగం ఉండాలన్నారు. మా ప్రభుత్వం, పార్టీ ద్వారా ఏడాదిపాటు గాంధీ భారత్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

సుర్జేవాలా తీరుపై మంత్రుల మండిపాటు

● ఓ వర్గానికి వత్తాసు పలుకుతున్నారని ఆగ్రహం ● అధిష్ఠానానికి ఫిర్యాదు చేసే యోచన

బెంగళూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలాపై సీఎం సిద్దరామయ్యకు ఆప్తులుగా భావిస్తున్న కొందరు మంత్రులతోపాటు ఎమ్మెల్యేలు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో తాజా రాజకీయాల్లో సీఎం, డీసీఎంలు రెండు గ్రూపులుగా మారాయి. ఎవరికివారు విభేదాలు లేవంటున్నా విందు రాజకీయాలు చోటు చేసుకోవడం, వాటిని రద్దు చేయించిన పరిణామాలు తెలుస్తూనే ఉన్నాయి. డీసీఎం డీకే శివకుమార్‌కు పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ సుర్జేవాలా మద్దతు ఇస్తున్నారనే విషయమై కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు సీఎం సిద్దరామయ్య వద్ద అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. రెండు గ్రూపులకు సమానంగా నిర్ణయాలు తీసుకోవాల్సిన సుర్జేవాలా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ మండిపడుతున్నారు. రెండురోజులక్రిందట బెళగావిలో గాంధీ భారత్ సభ సన్నాహక సభలో కొందరు కార్యకర్తలు సుర్జేవాలా తీరుపై మండిపడిన విషయం తెలిసిందే. వారిలో కొందరు మంత్రి సతీశ్‌జార్కిహొళి ఆప్తులనేది తేలింది. బెళగావిలో సతీశ్ జార్కిహొళి వర్సెస్ లక్ష్మీ హెబ్బాళ్కర్‌ల మధ్య విభేదాలు ఉన్నాయి. మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్‌కు డీసీఎం మద్దతు ఇస్తున్నారనే విషయమై మండిపడినట్లు తెలుస్తోంది. అయితే మంత్రి సతీశ్‌జార్కిహొళి, రణదీప్‌సింగ్ సుర్జేవాలాతో తమకెటువంటి విబేధాలు లేవని, సన్నిహితంగానే ఉన్నారంటూ వ్యాఖ్యానించారు. కానీ ఒకానొక దశలో సుర్జేవాలాపై బహిరంగంగానే విమర్శించిన విషయాన్ని తీవ్రంగా పరిగణించాల్సి వస్తోంది. గాంధీ భారత్ సభ వేళ వివాదాలు తీవ్రం చేయరాదని వెనుకడుగు వేశారు. రానున్న రోజుల్లో ఎటువంటి పరిణామాలకు దారి తీస్తాయనేది వేచి చూడాల్సి ఉంది.

ఎవరి తలరాత ఎలాగో.. వేచి చూస్తా : డీకే

తలరాత ఎలా రాసిపెట్టి ఉంటే అలా జరుగుతుందని అంతకుమించి ఏం చెబుతామని డీసీఎం డీకే శివకుమార్ అభిప్రాయపడ్డారు. మంగళవారం బెళగావి సర్క్యూట్ హౌస్‌లో మీడియాతో మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలు, అంబేడ్కర్ రాజ్యాంగం కాపాడాలనేది కాంగ్రెస్ ఆశయమన్నారు. రాష్ట్రంలో తాజా రాజకీయాలపై మీడియా ప్రశ్నకు సమాధానమిచ్చారు. తలరాత ఎలా ఉంటే అలా జరుగుతుందన్నారు. కానీ కొన్ని మీడియాల్లో పార్టీలో సఖ్యత లేదని ప్రచారం చేస్తున్నారన్నారు. ఎవరో వ్యాఖ్యానిస్తే తానెలా సమాధానం చెబుతానని దాటవేశారు. పార్టీకోసం అంకితభావంతో పనిచేశానని, భవిష్యత్తులోనూ చేస్తానని, పదవులు శాశ్వతం కాదన్నారు.

దర్శన్ తుపాకీ లైసెన్స్ రద్దు



బెంగళూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకాస్వామి హత్యకేసులో రెండో నిందితుడిగా ఉన్న నటుడు దర్శన్ తుపాకీ లైసెన్స్‌ను పోలీసులు రద్దు చేశారు. ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న దర్శన్ తుపాకీ లైసెన్స్‌ను పునరుద్ధరించాలని ఇటీవల పోలీసులను కోరారు. అయితే దీనిని పోలీసుశాఖ నిరాకరించింది. దర్శన్‌ను అరెస్టు చేసినప్పుడు అతడి వద్ద ఉండే తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం బెయిల్‌పై బయటకు వచ్చానని, తానో సినిమా సెలబ్రిటీ అని, ప్రాణానికి ప్రమాదం ఉందని విన్నవించినా పోలీసుశాఖ అంగీకరించలేదు. తీవ్రమైన నేర చరిత్ర కల్గినవారికి తుపాకీ లైసెన్స్ కొనసాగించలేమని నగర పోలీస్ కమిషనర్ దయానంద్ మంగళవారం తెలిపారు. ఆ వ్యక్తి నేరంలో భాగస్వామ్యులయ్యారని, నేర చరిత్ర ఉన్నప్పుడు లైసెన్స్ కొనసాగించలేమన్నారు.

మైక్రో ఫైనాన్స్ వేధింపులకు

మహిళ బలి

బెంగళూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మైక్రో ఫైనాన్స్ సిబ్బంది వేధింపులకు ఓ మహిళ బలయ్యింది. రామనగర తాలూకా తిమ్మయ్యనదొడ్డి గ్రామానికి చెందిన యశోదమ్మ (59) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. వ్యవసాయం, ఇంటి అవసరాలకోసం ఆమె 8 ఫైనాన్స్ కంపెనీలనుంచి రూ.5లక్షల దాకా అప్పు తీసుకున్నారు. బకాయి చెల్లించాలని ఫైనాన్స్ సిబ్బంది ఇంటి వద్ద గొడవకు దిగడంతో అందికి తెలిసి అవమానం అవుతుందని భావించిన ఆమె ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈమేరకు రామనగర గ్రామీణ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.



బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రాధామోహన్‌దాస్, రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, మాజీ సీఎం బొమ్మై తదితరులు

విభేదాలతో పార్టీకి నష్టం తెస్తారా..?

● యత్నాళ్ సరే... మీరేం చేశారు? ● కోర్‌కమిటీ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జ్ రాధామోహన్‌దాస్ ఆగ్రహం

బెంగళూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విభేదాలతో రాష్ట్రంలో పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని, గ్రూపు రాజకీయాలపై ఉపేక్షించేది లేదని రాష్ట్ర ఇన్‌చార్జ్ రాధామోహన్ దాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర పార్టీ కార్యాలయం జగన్నాథభవన్‌లో రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్, జాతీయ ప్రధాన కార్యదర్శి రాధామోహన్‌దాస్ అగర్వాల్ మంగళవారం రెండు విడతల సమావేశం నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో తాజా రాజకీయ పరిస్థితులపై అభిప్రాయాలు సేకరించారు. అనంతరం పార్టీ ముఖ్యనాయకులతో ప్రత్యేకంగా చర్చలు జరిపారు. అనంతరం జరిగిన కోర్ కమిటీలో గ్రూపు విభేదాలపై తారస్థాయిలో మండిపడ్డారు. యత్నాళ్ వర్గం పార్టీకి వ్యతిరేకంగా మారారంటూ పలువురు సభ్యుల ప్రస్తావనపై ఆయన మండిపడ్డారు. యత్నాళ్ సరే... మీరేం చేశారంటూ తీవ్రస్థాయిలో మందలించారు. గ్రూపు విభేదాలతో పార్టీ కార్యకర్తలు ఎలా వ్యవహరించారని మందలించినట్లు తెలుస్తోంది. అధ్యక్షుడి మార్పు అంశంపై ఎవరికి వారు మాట్లాడరాదని హెచ్చరించారు. ఏ విధమైన నిర్ణయమైనా అధిష్ఠానం తీసుకుంటుందని, రాష్ట్రంలో ఎటువంటి వ్యాఖ్యలు చేయరాదన్నారు. సంస్థాగత ఎన్నికలు నిర్వహించడం పార్టీని బలోపేతం చేసేందుకే అన్నారు. సమావేశంలో కో ఇన్‌చార్జ్ సుధాకర్‌రెడ్డి, పరిశీలకులు పొన్ను రాధాకృష్ణన్, మాజీ సీఎంలు బొమ్మై, సదానందగౌడ, ప్రతిపక్షనేత అశోక్, మాజీ మంత్రులు అశ్వత్థనారాయణ, శ్రీరాములు, సీటీ రవి, పార్టీ ఉపాధ్యక్షుడు నిర్మల్‌కుమార్ సురానా తదితరులు పాల్గొన్నారు.

కట్టా నివాసంలో విజయేంద్ర వర్గం భేటీ

బీజేపీలో వర్గ విబేధాలు మరింత ముదురుతున్నాయి. రాష్ట్ర అధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగుతున్న తరుణంలో విజయేంద్ర ఆప్తుడు, మాజీ మంత్రి కట్టా సుబ్రమణ్యం నాయుడు నివాసంలో భేటీ అయ్యారు. మంగళవారం రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రాధామోహన్‌దాస్ కీలకమైన సభ నిర్వహించేందుకు సిద్ధమవుతున్న తరుణంలోనే పలువురు సీనియర్ నేతలు భేటీ అయ్యారు. రేణుకాచార్య, బసవరాజ్ దడేసగూరు, హర్తాళ హాలప్ప, మాజీ ఎమ్మెల్యే రూపాలి నాయక్, బసవరాజ్ నాయక్, జీవరాజ్, మాజీ మంత్రి బీసీ పాటిల్, మాజీ ఎమ్మెల్సీ అణ్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


అమ్మకానికి సిద్ధంగా ఉన్న వెల్లుల్లి

ఘాటెక్కిన వెల్లుల్లి..!

● హోసూరు మార్కెట్లో గరిష్ఠంగా రూ.600 పలికిన ధర

అత్యాచారం కేసులో ఇద్దరు కూలీల అరెస్టు

బీజేపీ రాష్ట్ర పరిషత్ సభ్యుడిగా రాజేశ్

వివరాలు..7లో

చెస్ చాంపియన్.. స్టీఫెన్



బహుమతి అందుకుంటున్న శామ్యూల్ స్టీఫెన్‌నోబుల్

జిల్లాకు చెందిన శామ్యూల్ స్టీఫెన్ నోబుల్ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నాడు. ఆంధ్రాచెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా కాకినాడలో నిర్వహిస్తున్న నేషనల్ స్కూల్స్ చెస్ చాంపియన్‌షిప్-2025 పోటీలు ముగిశాయి. 28 రాష్ట్రాల నుంచి సుమారు 1200మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన శామ్యూల్ స్టీఫెన్ నోబుల్ 9మ్యాచ్‌లు ఆడి 7 మ్యాచ్‌లో గెలుపొంది ఈ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నాడు. అతిథుల చేతుల మీదుగా ట్రోఫీ, నగదు బహుమతి అందుకున్నాడు. విజేతను ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్, గౌరవాధ్యక్షుడు బాలరాజు, కోశాధికారి కిశోర్, ఇంటర్నేషనల్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్ నాయుడు, కోచ్ హుస్సేన్‌ఖాన్‌లు అభినందించారు. **- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్లాక్‌టవర్**

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలలో పాల్గొనే జూనియర్ క్రీడాకారుల ఎంపిక పోటీలు మంగళవారం అనంతపురంలో నిర్వహించారు. ఎంపికైనవారి వివరాలను జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి శివకుమార్ తెలిపారు. బాలికల విభాగంలో వందన, మాన్విత, తరుణిక, రక్ష, జస్మిత, షణ్ముఖసాయిప్రియ ఎంపికయ్యారు. బాలుర విభాగంలో పవన్ కేశవ రెడ్డి, యజ్ఞరూప్ యాదవ్, గురువర్ధన్, మహ్మద్ ఆయాన్, సాయి, జయదీప్‌సాయి, దాదా సలామాన్‌లు ఎంపికయ్యారు. వీరు ఈనెల 23 నుంచి విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. **- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్లాక్‌టవర్**

గీత కార్మికులకు మద్యం దుకాణాలు

అనంతలో 14, శ్రీ సత్యసాయి జిల్లాలో 9 కేటాయింపు

అనంతపురం అర్బన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు ప్రైవేటు మద్యం దుకాణాలను కేటాయిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం జిల్లాలో 14, శ్రీసత్యసాయి జిల్లాలో 9 ప్రైవేటు మద్యం దుకాణాలను ఈడిగ, గౌడ వర్గాలకు కేటాయించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ అధికారులకు అధికారికంగా సమాచారం అందింది. దరఖాస్తు ఫీజు (నాన్‌రిఫండబుల్) రూ.2లక్షలుగా నిర్ణయించారు. అయితే లైసెన్స్ ఫీజు విషయంలో ప్రభుత్వం మినహాయింపునిచ్చింది. ఒక్కో దుకాణానికి 50 శాతం మాత్రమే లైసెన్స్ ఫీజు వసూలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 5 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఫిబ్రవరి 7న లాటరీ తీయాలని నిర్ణయించారు.

ఏఐటీయూసీ జిల్లా వర్క్‌షాప్

వచ్చే నెల 22 నుంచి నిర్వహణ

అనంతపురం విద్య, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కార్మిక సమస్యలపై ఫిబ్రవరి 22 నుంచి ఏఐటీయూసీ జిల్లా స్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి పేర్కొన్నారు. ఆ సంఘం కార్యాలయంలో వర్క్‌షాప్ పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కార్మిక, ఉద్యోగ సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నా యన్నారు. ఎన్ని పోరాటాలు చేసినా ప్రభుత్వాలు సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. ఉద్యోగులకు భద్రత కల్పించడం మానేసి అవుట్ సోర్సింగ్ వ్యవస్థను ప్రోత్సహిస్తున్నారన్నారు. 20 ఏళ్లుగా అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సమస్యలపై కార్మికుల్లో అవగాహన తేవడానికి, చైతన్యం నింపడానికి వర్క్‌షాప్ పెట్టినట్లు తెలిపారు. వచ్చే నెల 22, 23, 24 తేదీల్లో వర్క్‌షాప్ ఉంటుందన్నారు. కార్మికులు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్, ప్రధానకార్యదర్శి కృష్ణుడు, నగర అధ్యక్షులు చిరంజీవి, ఇతర నాయకులు రాజు, బాషా, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు



వరించేలా

పలు ప్రాంతాల్లో జోరుగా వరిసాగు

నీరుంటే చాలు పుడమి కడుపున రైతులు బంగారం పండిస్తారు. సేద్యంలో తరిస్తూ జీవ జాతికి కడుపునింపుతారు. ప్రస్తుతం జిల్లాలోని పలు ప్రాంతాల్లో నీరు సమృద్ధిగా ఉండటంతో రైతులంతా పంటల సాగులో నిమగ్నమయ్యారు. కొన్ని చోట్ల ట్రాక్టర్లతో వరిమడిని సిద్ధం చేస్తుండగా, కూలీలు నాట్లు వేస్తున్నారు. మరికొన్ని చోట్ల వేరుశనగ సాగు చేస్తున్నారు. ముఖ్యంగా నాలుగేళ్ల తర్వాత బీటీపీకి నీరు రావడంతో చివరి ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కణేకల్లు చెరువు కింద రెండో పంటకు సరిపడా నీరు ఉండటంతో రైతులు వరి సాగులో బిజీబిజీగా ఉన్నారు.

- సేద్యం చేస్తూ.. నాట్లు వేస్తున్న రైతులు
- చివరి ఆయకట్టుకు నీరు వస్తుందన్న ఆశాభావం
- నీటితో కళకళలాడుతున్న రిజర్వాయర్లు, చెరువులు
- ఉత్సాహంగా సేద్యం పనుల్లో అన్నదాతలు

కణేకల్లు చెరువు కింద రెండో పంట సాగు

● ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం ● రెండో పంటగా వరి

కణేకల్లు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ కృష్ణేశ్వర వడయార్ చెరువు కింద రెండో పంటగా వరిని సాగు చేస్తున్నారు. కణేకల్లుతో పాటు గంగులాపురం, రచ్చుమర్రి తదితర ప్రాంతాల రైతులు వరి సాగును ప్రారంభించారు. ఈ చెరువు కింద రబీసీజన్‌లో దాదాపు మూడు వేల ఎకరాలలో వరిపంటను సాగుచేస్తున్నారు. గతంలో రెండోపంటకు నీటి సమస్యలు ఏర్పడేవి. కానీ ఈ ఏడాది కణేకల్లు చెరువులో పుష్కలం గా నీరు ఉండటంతో రైతులంతా ఉత్సాహంగా పంటసాగుకు సిద్ధమయ్యారు. ఎన్నికల ముందు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తాను గెలిచి, కూటమి పార్టీలు అధికారంలోకి వస్తే కణేకల్లు చెరువు కింద రెండో పంటకు కూడా నీరు ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. తుంగభద్ర డ్యాంలోకి నీటిరాక ప్రారంభమైనప్పటి నుంచి హెచ్చెల్సీ అధికారులతో ముందస్తు ప్రణాళికలు చే యించి రెండో పంటకు అవసరమైన నీటిని కణేకల్లు చెరువులో నిల్వ ఉంచేలా చర్యలు తీసుకున్నారు. దీంతో రైతులు కూడా రెండోపంటకు సమాయత్తం అవుతూ ఇప్పటికే నాట్లు కూడా వేసుకుంటున్నారు.



కణేకల్లు చెరువు

సంతోషంగా ఉంది



రెండో పంటకు మా భూముల్లోకి సాగునీరు రావడం చాలా సంతోషంగా ఉంది. ఇటీవలే మాకున్న 1.5 ఎకరాల పొలంలో పండించిన ధాన్యాన్ని విక్రయించాం. వెంటనే రెండో పంటకు కూడా నీరు అందుబాటులో ఉండటంతో పంటసాగుకు సమాయత్తం అవుతున్నాం.

- రవి, రైతు, గంగలాపురం

రైతులందరికీ ఉపయోగం



ఈ ప్రాంతంలో వరిపంటే ప్రముఖంగా పండిస్తున్నాం. నాకు 70 సెంట్ల భూమి మాత్రమే ఉంది. అయితే ఏడాదిలో రెండు పంటలు సాగు చేసే అవకాశం రావడంతో ఇతర పనులకు వెళ్లకుండా వ్యవసాయాన్ని నమ్ముకుని గౌరవంగా జీవించే అవకాశం ఏర్పడింది. **- ఖాసీం, రైతు, కణేకల్లు**





శింగనమల ఆయకట్టు భూముల్లో సేద్యం పనులు చేస్తున్న రైతులు

2 వేల ఎకరాల్లో...

శింగనమల: శింగనమల శ్రీరంగరాయ చెరువు ఆయకట్టులో రెండు వేల ఎకరాల్లో వరిసాగుకు రైతులు సిద్ధమయ్యారు. ఈచెరువు కింద అధికారికంగా 2500 ఎకరాలు, అనధికారికంగా మరో 2500 ఎకరాల భూములు ఆయకట్టుగా సాగవుతున్నాయి. అయితే గత పదేళ్లలో ఇలా ఎక్కువ స్థాయిలో ఆయకట్టును సాగు చేసిన పరిస్థితి లేదు. బోరుబావుల కింద మరో 1500 ఎకరాల్లో కూడా వరి సాగుకు రైతులు సిద్ధం చేస్తున్నారు. నీరు వృథా చేయకుండా వాడుకుంటే చివరి ఆయకట్టు కూడా సస్యశ్యామలం అవుతుందని రైతులు చెబుతున్నారు. లేకుంటే చివరి ఆయకట్టు భూములు ఉన్న సోదనపల్లి, పోతురాజుకాల్వ, చక్రాయపేట గ్రామాలకు నీరు వెళ్లడం కష్టమవుతుంది.

నీరు సరిపోతుంది



వరినాట్ల కోసం మడిని సిద్ధం చేస్తున్న రైతు



చెరువులో పంట సాగుకు అవసరమైన నీరు ఉంది. నీరు సరిపోతుందనే నమ్మకంతోనే పంటలు సాగు చేస్తున్నాం. ఒకవేళ పంట చివరి దశలో నీరు తక్కువ వస్తే ఎమ్మెల్యే విడుదల చేయిస్తారనే నమ్మకం ఉంది.

- మాసూద్‌వలి(మోదు), రైతు, శింగనమల

దేవుడి మీద భారమేసి..



చెరువులో నీరు నిండుగా ఉంది. అందుకే దేవుడిపై భారం వేసి పంట సాగు చేస్తున్నాం. పంటలకు సాగు నీటి సమస్య రాదనే అనుకుంటున్నాం. భూమి తల్లి రైతులను ఎప్పుడూ మోసం చేయదు. దిగుబడి కూడా బాగా వస్తుందని నమ్మకంగా సాగు చేస్తున్నాం.

- తిరుపాలు, రైతు, శింగనమల



యర్రంపల్లి వద్ద ఆయకట్టులో వేరుశనగ సాగు

4 ఏళ్ల తర్వాత..

గుమ్మఘట్ట: నాలుగేళ్ల తర్వాత బీటీపీకి పూర్తి స్థాయిలో నీరు చేరడంతో ఎడమ కాలువ కింద 3500 ఎకరాలు, కుడికాలువ కింద 2600 ఎకరాలకు సాగునీటిని విడుదల చేశారు. దీంతో ఆయకట్టు రైతులు పంటల సాగులో బిజీబిజీగా కనిపిస్తున్నారు. రంగచేడు, ఎర్రంపల్లి, నేత్రపల్లి గ్రామాల పరిధిలో పదిరోజులుగా వరి, వేరుశనగ సాగులో రైతులు నిమగ్నమయ్యారు. డిసెంబరు చివరిలో సాగునీరు విడుదల కావడంతో ముందస్తుగా బోర్ల కింద నార్లు పోసుకొని ప్రస్తుతం కొంత మంది రైతులు నాట్లు వేసుకుంటుండగా మరికొంతమంది వేరుశనగ సాగు చేస్తున్నారు. మిగతా భూములను సాగుకు సిద్ధం చేసుకుని నార్లు పోసుకుంటున్నారు. 15వ డిస్ట్రిబ్యూటరీ నుంచి 17వ డిస్ట్రిబ్యూటరీ వరకు చివరి ఆయకట్టుకు నేరుగా సాగునీరు అందిస్తుండటంతో రైతులు పంటల సాగుకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆనందంగా ఉంది - ఆంజనేయులు, రైతు, రంగచేడు



నాలుగేళ్లుగా చివరి ఆయకట్టు భూములు నీళ్ల లేక బీళ్లుగా ఉండేవి. ప్రస్తుతం నీరు సమృద్ధిగా విడుదల చేస్తుండటంతో పచ్చ ని చేలుగా మారుతున్నాయి. చివరి ఆయకట్టు రైతులకు కూడా పంటలు పండించుకునే అవకాశం దొరకడం ఆనందంగా ఉంది.

బోరుబావుల్లో పుష్కలంగా నీరు: కంబరి మారెన్న, రైతు, రంగచేడు



బీటీపీ కాలువ నీరు ఆయకట్టుకు పారుతుండటంతో మా పొలాల్లోని బోరుబావులు రీచార్జ్ అవుతున్నాయి. బోరుబావుల్లో నీరు పుష్కలంగా వస్తోంది. అందుకే ముందస్తుగానే వరినారు పోసుకొని నాట్లు వేసేందుకు సిద్ధమయ్యాం. మరో మూడేళ్ల పాటు బోరుబావుల్లో పుష్కలంగా నీరు వస్తాయి.

చోరబడి

పాఠశాల కబ్జా

పశువుల పాకగా మార్చేసిన వైసీపీ నాయకులు





పాఠశాలలో పశువులను కట్టేసిన వైసీపీ నాయకులు



పాఠశాల ప్రధాన దారికి ముళ్ల కంపలు అడ్డుగా వేసిన వైసీపీ నాయకులు



గ్రామ కంఠం అంటూ అధికారులు ఇచ్చిన సర్టిఫికెట్(స్కెచ్)

విడపనకల్లు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు ఆగడాలు, ఆక్రమణలు ఇప్పటికీ ఆగటంలేదు. ఉండబండ గ్రామంలో ఇద్దరు వైసీపీ నాయకులు వినియోగంలో లేని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆక్రమించుకున్నారు. అందులో తమ పశువులను, గొర్రెలను, వ్యవసాయ పనిముట్లను ఉంచుతున్నారు. గ్రామంలో 1 నుంచి 5వ తరగతి వరకూ ప్రాథమిక పాఠశాల ఉండేది. విద్యార్థులు ఎక్కువ కావ టంతో దాన్ని ఎంపీయూపీ పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. 2012 నుంచే ఎంపీ యూపీ పాఠశాల ప్రారంభం అయింది. ఊరి చివరన అదనపు గదులను నిర్మించి పాఠశాలను అక్కడికి తరలించారు. దీంతో గ్రామం నడిబొడ్డున ఖాళీగా ఉన్న ప్రాథమిక పాఠశాల లో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహించేవారు. అయితే గ్రామానికి చెందిన అన్నతమ్ములైన వైసీపీ నాయకులు పల్లే రామలింగ, పల్లే పెద్ద లింగప్ప 2020లో అంగన్‌వాడీ కేంద్రాలను ఖాళీ చేయించి ప్రాథమిక పాఠశాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. పాఠశాలలోకి ఎవరూ వెళ్లకుండా ప్రధాన దారికి ముళ్ల కంపలు కొట్టి బంద్ చేశారు. దీనిపై మండల అధికారులు నోటీసులు జారీ చేసినా ఆక్రమణదారుల్లో బెరుకు లేకుండా పోయింది. ఇది మాదే అంటూ అధికారులతోను, పోలీసులతోనే వాదిస్తున్నారు. సర్వే నంబరు 151లో డైక్లాట్‌లోను ఈ స్థలం గ్రామ కంఠం అని ఉందని రెవెన్యూ అధికారులు తేల్చారు. ఆక్రమించుకున్న పాఠశాలను ఖాళీ చేసి ప్రభుత్వ అధికారులకు స్వాధీనం చేయాలని రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేసినా ఫలితం లేదు. వచ్చే ఏడాది గ్రామానికి జడ్పీ ఉన్నత పాఠశాల వస్తోందని, సరిపడ తరగతి గదులు లేకపోతే విద్యార్థులు ఇబ్బంది పడతారని పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ హెచ్‌పీ రాజు పేర్కొన్నారు. పాత స్కూల్ గదులను ఖాళీ చేస్తే మరమ్మతులు చేయించి 1 నుంచి 5 తరగతులు ఇక్కడే నిర్వహించేలా చూస్తామన్నారు. ఎంఈఓ శ్రీనివాసులు మాట్లాడుతూ పాఠశాలను ఆక్రమించుకున్న వారికి ఖాళీ చేయాలని ఎన్ని సార్లు చెప్పినా వినిపించుకోవడం లేదన్నారు. వారం కిందట కూడా నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లా అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి తప్పకుండా ఖాళీ చేయిస్తాం. దీనిపై తహసీల్దార్ సునీతీబాయి మాట్లాడుతూ పాత పాఠశాల ఉన్న స్థలం మొత్తం సర్వే నంబరు 151లోని గ్రామ కంఠం అన్నారు. దీనిపై ప్రైవేట్ వ్యక్తులకు ఎలాంటి అధికారం లేదన్నారు.

భారీగా తగ్గిన కంది దిగుబడి
అరకొర ధరలతో అన్నదాత కుదేలు

ఏ పంట పెట్టినా

ఇంతేనా..!





తగ్గుపర్తిలో యంత్రం ద్వారా గ్రేడింగ్ చేస్తున్న రైతులు



యంత్రాలతో కందిపంట కోస్తున్న రైతులు

బెళుగుప్ప, జనవరి 21(ఆంధ్రజ్యోతి): వాతావరణం అనుకూలించకపోవడంతో ఈ ఏడాది కంది పంట దిగుబడి బాగా తగ్గిపోయింది. దీంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. మండల వ్యాప్తంగా 17,616 ఎకరాలలో ఈ ఏడాది కంది పంట సాగుచేశారు. ఎర్రనేల భూముల్లో సాగుచేసిన పంట కాస్తో కూస్తో దిగుబడి వచ్చినా, నల్లరేగడి భూముల్లో సాగు చేసిన రైతులకు నష్టాలే మిగిలాయి. అననుకూల వాతావరణంలో పంటకు తెగుళ్లతో పాటు పచ్చపురుగు విపరీతంగా ఆశించింది. నివారణకు వేలాది రూపాయలు వెచ్చించి పురుగు మందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండాపోయిందని పలువురు రైతులు వాపోతున్నారు. గతంలో మూడు దఫాలు క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తే మంచి దిగుబడితో పంట చేతికొచ్చేదని, ఈ ఏడాది ఐదు నుంచి ఆరుసార్లు పిచికారీ చేసిన దిగుబడి మాత్రం ఎకరాకు మూడు క్వింటాళ్లలోపే వచ్చింది. ప్రస్తుతం ధర కూడా తగ్గుతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో రూ.తొమ్మిది వేల నుంచి పది వేలు వరకు ధర ఉండగా ఇప్పుడు రూ. ఆరు వేలకు దిగివచ్చింది. ఎకరా కంది సాగు చేయడానికి సేద్యం, విత్తనాలు, పురుగుమందులు, కోతలు, కూలీలు తదితర ఖర్చులు కలుపుకుని రూ.15 వేలకు పైగా పెట్టుబడి అవుతుందని రైతులు చెబుతున్నారు. పంటబాగా పండి ఉంటే ఎకరాకు ఆరేడు క్వింటాళ్ల దిగుబడి వచ్చేదని, ప్రస్తుతం మూడు క్వింటాళ్లు కూడా రాకపోవడం, ధర కూడా లేకపోవడంతో నష్టాలు తప్పని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలంటూ కోరుతున్నారు.

ఎకరాకు రెండు క్వింటాళ్లే..



ఎంతో ఆశతో 15 ఎకరాలు కౌలుకు తీసుకుని కంది పంట సాగుచేయగా ఎకరాకు రెండు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మొత్తం 30 క్వింటాళ్లు అయ్యాయి. పెట్టుబడి ఎక్కువ... దిగుబడి తక్కువ రావడంతో దిక్కు తోచడం లేదు. వచ్చిన నష్టాన్ని ఎలా పూడ్చుకోవాలో తెలియడం లేదు. **- నాగరాజు, రైతు, తగ్గుపర్తి**

నిరాశాజనకంగా దిగుబడి



వాతావరణం అనుకూలించకపోవడంతో కంది పంటలో ఆశించిన దిగుబడులు రాలేదు. పెట్టుబడి ఒక ఎకరాకు రూ. 15 వేలు పెట్టాము. దిగుబడి మాత్రం మూడు క్వింటాళ్లలోపే వస్తోంది. గిట్టుబాటు ధర కూడా లేదు. క్వింటాల్‌కు రూ. 6500లకు వ్యాపారులు అడుగుతున్నారు. గిట్టుబాటు ధర వస్తేనే రైతులు గట్టెక్కేది.


- ఎర్రిస్వామి, రైతు, ఎర్రగుడి



నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

కాళేశ్వరరావు (జయంతి)



అయ్యదేవర కాళేశ్వరరావు కృష్ణా జిల్లా నందిగామలో 1881 జనవరి 22న జన్మించారు. మహాత్మాగాంధీ నాయకత్వంలోని అన్ని ఉద్యమాల్లోనూ వీరు చురుకైన పాత్రను పోషించారు. పలుమార్లు కారాగార శిక్షను అనుభవించారు. విజయవాడ పురపాలక సంఘం అధ్యక్షునిగా సేవలందించారు. మద్యపాన నిషేధ చట్టం, సేల్స్‌టాక్సు, హరిజన దేవాలయ ప్రవేశం తదితర చట్టాల రూపకల్పనలో క్రియాశీలక పాత్రను పోషించి అందరి ప్రశంసలు పొందారు. స్వాతంత్ర్యానంతరం విజయవాడ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి శాసన సభకు ఎన్నికయ్యారు. శాసనసభ తొలి స్పీకర్‌గా పనిచేశారు. 1962 ఫిబ్రవరి 26న విజయవాడలో కన్నుమూశారు.

మాడపాటి హనుమంతరావు (జయంతి)




ఆంధ్రా పితామహగా ఖ్యాతి పొందిన 'పద్మభూషణ' గ్రహీత మాడ పాటి హనుమంతరావు 1885 జనవరి 22న కృష్ణా జిల్లా నంది గామ తాలూకా పొక్కునూరులో జన్మించారు. ఆయన రచించిన ఎన్నో చిన్నకథలు బహుళ ప్రజా దరణ పొందాయి. నిజాం హయాంలో తెలుగు భాషాభివృద్ధికి అపార సేవలందించారు. హైదరాబాద్ తొలి మేయర్‌గా పనిచేశారు. ఆంధ్ర మహాసభ సంస్థాపకుల్లో ఆయన ఒకరు. 1970 నవంబరు 11న కన్నుమూశారు.

కొండపల్లి శేషగిరిరావు (జయంతి)



ప్రముఖ చిత్రకారుడు కొండపల్లి శేషగిరిరావు 1924 జనవరి 22న వరంగల్ జిల్లా పెనుగొండ గ్రామంలో జన్మించారు. భారతీయ సంప్రదాయ చిత్రలేఖనంలో అద్భుతాలు సృష్టించారు. ఆక్వా టెక్చర్ పెయింటింగులకు ఆయనను మార్గదర్శకుడిగా చెబుతారు. వీరి చిత్రాలలో శకుంతల, దమయంతి, రామాయణం వంటి పురాణాలకు సంబంధించిన కళాఖండాలు ప్రశంసలు అందుకున్నాయి. తొలి ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా వీరు 'తెలుగు తల్లి' ని సాక్షాత్కరింపజేశారు. తెలంగాణ కాకి పడగలు, రామప్ప దేవాలయం విశిష్టతను వివరించిన తొలి చిత్రకారుడు కూడా ఆయనే కావడం విశేషం. డాక్టరేట్‌లతో పాటు హంస అవార్డులను అందుకున్నారు. వీరి చిత్రాలు దేశ పార్లమెంటు, ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీ, సాలార్‌జంగ్ మ్యూజియంలో ఉంచారు. 2012 జూలై 26న కన్నుమూశారు.

అక్కినేని నాగేశ్వరరావు (వర్ధంతి)



'పద్మ విభూషణ్' గ్రహీత అక్కినేని నాగేశ్వరరావు (ఏఎన్నార్) కృష్ణా జిల్లా నందిగామ మండలం రామాపురంలో 1924 సెప్టెంబరు 20న జన్మించారు. తెలుగు సినిమా తొలినాళ్ళ అగ్ర నాయకుల్లో అక్కినేని ఒకరు. నాటకాలలో స్త్రీ పాత్రల ద్వారా ప్రేక్షకుల ఆదరణ చూరగొన్నారు. తెలుగు, తమిళ సినిమాల్లో దాదాపు 75 సంవత్సరాల పాటు నటించారు. మరో అగ్రనటుడు ఎన్టీఆర్‌తో పాటు తెలుగు సినిమాకు మూలస్తంభంగా గుర్తింపు పొందారు. సమాజ సేవలో సదా ముందుండే వారు. ప్రతిష్టాత్మక 'దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం', పద్మశ్రీ, పద్మభూషణ్, ఎన్టీఆర్ జాతీయ పురస్కారం ఇతర గౌరవాలు అందుకు న్నారు. 2014 జనవరి 22న కన్నుమూశారు.

టీఎం కృష్ణ (పుట్టినరోజు)



కర్ణాటక సంగీత గాయకుడు, రచయిత తోడూరు మాడభూషి కృష్ణ చెన్నైలో 1976 జనవరి 22న జన్మించారు. మద్రాస్ మ్యూజిక్ అకాడమీకి ఆయన సంస్థాపక సభ్యుడు. సంగీత సంప్రదాయ ప్రదర్శినికి సంబంధించి దీక్షితార్ బాణీలకు ఆయన స్వరకల్పన చేశారు. కర్ణాటక సంగీతానికి సంబంధించి పలు పుస్తకాలను కూడా రాశారు. ప్రతిష్టాత్మక రామన్ మెగసెసె అవార్డు, ఇందిరాగాంధీ జాతీయ సమైక్యతా పురస్కారం ఇతర గౌరవాలు పొందారు. 2024 లో సంగీత కళానిధి పురస్కారం అందుకున్నారు.

పోక్సో కేసులో ఐదేళ్ల జైలు

అనంతపురం క్రైం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో గుంతకల్లు పట్టణం తిలక్‌నగర్‌కు చెందిన షేక్ షెక్షావలి అలియాస్ అంగడి వలికి కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించింది. ఈ మేరకు పోక్సో కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి మంగళవారం తీర్పు వెలువరించారు. బాధితురాలికి రూ.రెండు లక్షల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. గుంతకల్లు పట్టణం తిలక్‌నగర్‌కు చెందిన షెక్షావలి స్థానికంగా అంగడి పెట్టుకుని వ్యాపారం చేసేవాడు. 2020 జనవరి 16న ఏడేళ్ల బాలిక చాక్లెట్ కొనుక్కోవడానికి ఆ అంగడికి వెళ్లింది. బాలికకు మాయమాటలు చెప్పిన ముద్దాయి తన అంగడి లోపలికి పిలిచి, ఒడిలో కూర్చోబెట్టుకుని అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక భయపడి గట్టిగా అరచి, పరిగెత్తుకెళ్లి తల్లికి చెప్పింది. ఏం జరిగిందో తెలుసుకున్న తల్లిదండ్రులు గుంతకల్లు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ చిన్న గోవిందు కేసు నమోదు చేశారు. డీఎస్పీ ఖాసీం సాబ్ కేసు దర్యాప్తు చేసి పోక్సో కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసులో 14మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో షెక్షావలికి శిక్ష విధించారు. స్పెషల్ పీపీ ఈశ్వరమ్మ ప్రాసిక్యూషన్ తరపున వాదించారు. సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరు పరిచి ముద్దాయికి శిక్ష పడేలా చేసిన కోర్టు మానిటరింగ్ సిస్టం వెంకటేష్‌నాయక్, ఇతర అధికారులను జిల్లా ఎస్పీ జగదీష్ అభినందించారు.

టమోటా కిలో రూ. 12

అనంతపురం రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 12తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 675 టన్నుల దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 9, కనిష్ఠ ధర రూ. 7 పలికినట్లు తెలిపారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి



కలుషితమైన చెరువు



చెరువు సంరక్షణా కమిటీ సభ్యులు

దొడ్డబళ్లాపుర, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తాలూకాలో సరైన మౌలిక సదుపాయాలు లేవని చెరువు సంరక్షణా వేదిక సమితి ఆగ్రహం వ్యక్తం చేసింది. దొడ్డబళ్లాపుర నగరసభ, బాశెట్టిహళ్ళి పట్టణ పంచాయతీ డ్రైనేజీ నీరు, ఫ్యాక్టరీల రసాయన వ్యర్థాలు నేరుగా అర్కావతి నదికి అనుబంధమైన చెరువులలోకి చేరి కలుషితంగా మారాయన్నారు. ఈ చెరువునీటిని వినియోగిస్తే అనారోగ్యం తథ్యమన్నారు. చెరువులను సంరక్షించాలని, తాలూకాలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 26న గణతంత్ర దినోత్సవాల వేళ ఇంటిపై నల్లజెండా ఎగురవేసి నిరసన చేపట్టాలని సమితి తీర్మానించిందన్నారు. ఇప్పటికే తహసీల్దారు విద్యావిభా రాథోడ్, రూరల్ ఎస్సై సాదిక్‌పాషా చేసిన రాజీ చర్చలు విఫలమయ్యాయి. చెరువు సంరక్షణ పోరాట సమితి ముఖ్యుడు వసంత్ మాట్లాడుతూ పదేళ్లుగా పోరాటం చేస్తున్నా పరిష్కారం కాలేదని, శుద్ధతాగునీరు అందడం లేదన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇచ్చిన హామీలు విఫలమయ్యాయన్నారు. ప్రధానంగా వర్షపునీటి సేకరణకోసం ఇంకుడుగుంతల విధానం పాటించాలని, భూగర్భజలాలు కలుషితం కుండా ఫ్యాక్టరీలకు కఠిన నిబంధనలు అమలు చేయాలన్నారు.

అడ్వాంటేజ్ అస్సోంలో భాగస్వాములు కండి



రోడ్‌షోలో అస్సాం మంత్రి అశోక్‌సింఘాల్ తదితరులు

బెంగళూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అడ్వాంటేజ్ అస్సోం 2.0 పేరిట పెట్టుబడుల సదస్సుల భాగస్వామ్యులు కావాలని పారిశ్రామికవేత్తలకు మంత్రి అశోక్‌సింఘాల్ పిలుపునిచ్చారు. నగరంలో మంగళవారం రోడ్‌షోలో అస్సోంకు చెందిన బృందం పాల్గొంది. గౌహతిలో ఫిబ్రవరి 25 నుంచి రెండురోజులపాటు జరిగే పెట్టుబడుల సదస్సుకు బెంగళూరులోని వివిధ విభాగాల పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. అస్సోంలో భిన్నమైన పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం ఉందని మంత్రి అశోక్‌సింఘాల్ తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌కేసీసీఐ అధ్యక్షులు ఉల్లాస్‌కామత్, అస్సోం వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ అశోక్‌బాబు, అస్సోంకు చెందిన అధికారులు నితిన్ బసంత్, భైరబ్ బరువా, వినోద్ సుబ్రమణియన్, సజాద్ ఆలంలు పాల్గొన్నారు. పెట్రో కెమికల్స్, టీ తోటలు, ఎలక్ట్రానిక్స్, ఫార్మా, ఆహార సంస్కరణ, గ్రీన్ ఎనర్జీ, రక్షణ, ఎయిర్‌ఫోర్స్ వంటి రంగాలు అభివృద్ధికి అనుకూలమన్నారు.

స్ఫూర్తిదాయకులు శివకుమార స్వామీజీ



శివకుమారస్వామిజీ వర్ధంతిలో స్థానిక సంఘం ప్రముఖులు

విజయపుర, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కులమత భేదం లేకుండా సిద్దగంగామఠం మఠంలో విద్య, వసతి, అన్నదాసోహం నిరంతరంగా చేసిన శివకుమారస్వామిజీ స్ఫూర్తిదాయకులని పట్టణంలోని నగరేశ్వరస్వామి అభివృద్ధి ట్రస్టు మాజీ అధ్యక్షుడు జేఆర్‌పి మురళీధర్ అభిప్రాయపడ్డారు. దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని గాంధీచౌక్‌లో నగర్తయువజన సంఘం, మహిళాసంఘం, నగరేశ్వరస్వామి సేవా సమితి తదితర సంఘాల సంయుక్త సహకారంతో మంగళవారం శివకుమారస్వామిజీ ఆరో వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం అన్నదాసోహం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర్తమఠం గౌరవ కార్యదర్శి విశ్వనాథ్, సంస్థ అధ్యక్షుడు పునీత్‌కుమార్, నగర్తయువ సంఘం మాజీ అధ్యక్షుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ప్రతిభోత్సవ 2025



వివిధరంగాల సాధకులకు సన్మానం

విజయనగర్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): సుంకదకట్టె శ్రీనివాసనగర్‌లోని అంజలి కాన్వెంట్, నైటింగేల్ హైస్కూల్ వార్షికోత్సవంలో భాగంగా ప్రతిభోత్సవ 2025 కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులను సీనియర్ టీచర్ విశ్వేశ్వరయ్య నేతృత్వంలో ఆత్మీయంగా సత్కరించారు. కెంగేరిలోని విశ్వఒక్కలిగ మహాసంస్థాన మఠాధిపతి డాక్టర్ నిశ్చలానందనాథస్వామి సాన్నిధ్యం వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి కృష్ణేగౌడ అధ్యక్షత వహించగా సంస్థ కార్యదర్శులు ఎంఎస్ సరళ, రిటైర్డు ప్రిన్సిపాల్ నాగేగౌడ, నాటకరంగ, బుల్లితెర కళాకారిణి మాలతిశ్రీ, సుమిత్రమ్మ, జూనియర్ డాక్టర్ రాజ్‌కుమార్, జూనియర్ డాక్టర్ పునిత్‌రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. గత ఏడాది వివిధ తరగతులలో ప్రథమ ర్యాంకు పొందిన విద్యార్థులు, ఎస్ఎస్ఎల్‌సిలో 80 శాతానికిపైగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు, ఉత్తమ ఫలితాలు సాధించడానికి కారకులైన ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ పాఠశాలలో చదివి డాక్టర్లు అయిన సేవంత్ కె గౌడ, డాక్టర్ రమ్యా కె, డాక్టర్ మహాలక్ష్మి ఆర్ ఉప్పార్‌లను అభినందించారు. విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. పెద్దసంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర పరిషత్ సభ్యుడిగా రాజేశ్



రాజేశ్ తదితరులకు సన్మానం

మహదేవపుర, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పార్టీలో ప్రామాణికంగా పని చేసినవారికి చక్కటి అవకాశాలు సాధ్యమని మాజీ మంత్రి అరవింద లింబావళి అభిప్రాయపడ్డారు. హోబళి స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కృషి చేసిన కార్యకర్త ఎల్ రాజేశ్‌కు ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర పరిషత్ సభ్యుడిగా ఎంపిక అయ్యారంటూ అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంజు తదితరులు రాజేశ్‌ను అభినందించారు. అనంతరం రాజేశ్ మాట్లాడుతూ పార్టీ పెద్దలు తనకు అప్పగించిన బాధ్య తను నిర్వరిస్తానన్నారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకారం



ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ

శిడ్లఘట్ట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని తలకాయలబెట్టపై గల వెంకటరమణస్వామి ఆలయ అభివృద్ధికి వ్యవస్థాపనా సమితి, భక్తులకు తనవంతు సహకారం అందిస్తానని కేపీసీసీ కన్వీనర్ బీవీ రాజీవ్‌గౌడ తెలిపారు. తాలూకాలోని సాదలి హోబళి తలకాయలబెట్టపై పురాణ ప్రసిద్ధ వెంకటరమణస్వామి ఆలయ రాజగోపురం, ద్వారం, కొండపై మూడు నామాల డిజిటల్ నామఫలకానికి భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేల సంవత్సరాల చరిత్ర కల్గిన ఆలయానికి గ్రేడ్-1గా ఉందన్నారు. ఫిబ్రవరిలో జరిగే బ్రహ్మరథోత్సవానికి వేలాదిభక్తులు తరలివస్తారన్నారు. ఇక్కడ మౌలిక సదుపాయాల కల్పనకు భక్తులతోపాటు తనవంతు సహకారం ఉంటుందన్నారు. దేవాలయ వ్యవస్థాపనా సమితి అధ్యక్షుడు డీపీ నాగరాజ్, సాదలి గోవిందరాజు, శంకరప్ప, తిమ్మనాయకనహళ్ళి ఆనంద్, శ్రీనివాసరెడ్డి, పాండురంగప్ప తదితరులు పాల్గొన్నారు.

అశ్రునయనాల మధ్య బేడీకి అంతిమ వీడ్కోలు



నరేంద్రసింగ్ బేడీ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి సవిత



భార్య సోనియా బేడీ

పెనుకొండ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రజా ఉద్యమకారుడు, యంగ్ ఇండియా ప్రాజెక్ట్ వ్యవస్థాపకుడు నరేంద్ర సింగ్ బేడీకి మంగళవారం అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. గుట్టూరు సమీపంలోని ఆయన ఫామ్ హౌస్‌లో వయోభారంతో సోమవారం మృతి చెందారు. మంగళవారం ఆయన పార్థివదేహానికి రాజకీయ ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, వేలాది మంది ప్రజలు హాజరై అంతిమ వీడ్కోలు పలికారు. ఆయన అంతిమ యాత్రలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, మడకశిర మాజీ ఎమ్మెల్యే సుధాకర్, ఆర్డీటీ ప్రతినిధి అన్నా ఫెర్రర్, ఎస్ఎస్‌టీ ప్రతినిధి కంజిలాల్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బబ్లూ గంగూలీ, డీపీ బలరాం, కిష్టప్ప, మేరి, రాణి, వాసు, ఉత్తప్ప, రామాంజనేయులు, రాయలసీమ జిల్లాల్లోని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, కొల్‌కతా నుంచి వేలాది మంది ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. క్రిస్టియన్ సంప్రదాయ పద్ధతిలోనే ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన సేవలను కొనియాడారు.

అణగారిన వర్గాల కోసం కృషి : మంత్రి

పెనుకొండ రూరల్ : రాయలసీమలోని అణగారిన వర్గాల పేద ప్రజల కోసం నరేంద్రసింగ్ బేడీ నిరంతరం కృషిచేశారని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. బేడీ మృతిచెందిన విషయం తెలుసుకున్న మంత్రి మంగళవారం గుట్టూరు సమీపంలోని యంగ్ఇండియా ప్రాజెక్ట్ కార్యాలయానికి చేరుకుని నరేంద్రసింగ్ బేడీ మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఎన్నో పోరాటాలు చేసి ప్రజల హక్కులు కాపాడి, సమసమాజ స్థాపన కోసం జీవితాన్ని, ఆస్తిని ధారపోసి త్యాగం చేసిన వ్యక్తి నరేంద్రసింగ్‌బేడీ కొనియాడారు. ఆమె వెంట టీడీపీ నాయకులు సూర్యనారాయణ, నాగరాజు ఉన్నారు.

మహాత్మాగాంధీ

హే రామ్ అన్నారు

» విగ్రహావిష్కరణ సభలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీని హిందూ వ్యతిరేకి అని బీజేపీ వారు విమర్శిస్తారని కానీ తుదిశ్వాసలోనూ హేరామ్ అంటూ బాపూజీ జపించారని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. అత్యుత్తమమైన హిందువు అయిన గాంధీని బీజేపీ వర్గానికి చెందిన గాడ్సే హత్య చేశారన్నారు. బెళగావి సువర్ణసౌధ ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన భారీ గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత్రి ప్రియాంకగాంధీ, డీసీఎం డీకే శివకుమార్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, రణదీప్ సింగ్ సుర్జేవాలా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మేం గాంధీ హిందుత్వాన్ని నమ్మినవారమని కానీ బీజేపీ గాడ్సే సిద్ధాంతాలను పాటిస్తారన్నారు. గాంధీ సిద్ధాంతాలు తత్వాలను బీజేపీ వ్యతిరేకిస్తుందన్నారు. వందేళ్లక్రిందట ఆలిండియా కాంగ్రెస్ కమిటీ సమావేశం బెళగావిలో జరిగితే మహాత్మాగాంధీ అధ్యక్షత వహించారన్నారు. ఆ స్మృతిని ఎప్పటికీ మరువలేమన్నారు. 25 అడుగుల ఎత్తుతో సువర్ణసౌధ ప్రాంగణంలో ఆకర్షణీయం అనిపించేలా విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్, సభాపతి బసవరాజ హొరట్టితోపాటు మంత్రులు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ 'నా జీవనమే నా సందేశం' అనే వాక్యం గాంధీజీ విగ్రహం ముందు ఏర్పాటు చేయడం దేశానికి గౌరవం అన్నారు. గాంధీని ప్రపంచమే గౌరవిస్తుందన్నారు. సరిగ్గా వందేళ్లకిందట కాంగ్రెస్ సభకు అధ్యక్షత వహించిన గాంధీజీని స్మరించుకుంటూ మహాత్ముడి విగ్రహాన్ని ఆవిష్కరించే అవకాశం నా జీవితం ధన్యమైందన్నారు.

ప్రకృతిపై అభిమానంతో వ్యూ ఫైండర్

బెంగళూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిని ఆస్వాదించడం అంటే ఎంతో ఇష్టమని అందుకే 17ఏళ్లపాటు శ్రమించి వ్యూ ఫైండర్ పుస్తకాన్ని రూపొందించానని సంకేత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. నగరంలో వ్యూ ఫైండర్ యువర్ బ్రిడ్జ్ టు నేచర్ కాఫీటేబుల్ పుస్తకాన్ని లాంఛనంగా ఆవిష్కరించారు. దశాబ్దన్నరకాలంలో ఎన్నో అడవులు సందర్శించానన్నారు. ప్రముఖ నటుడు మాధవన్ పుస్తకానికి ముందుమాట రాశారన్నారు. సంకేత్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతిలో ఎన్నోఏళ్లుగా తీసుకున్న ఫోటోలను అద్భుత కళాఖండాలుగా వచ్చాయన్నారు. పుస్తకం విడుదల చేస్తానని భావించలేదని అయితే ఎంతోకాలంగా నాలో దాగియున్న ప్రతిభకు పుస్త కమే నిదర్శనంగా భావిస్తున్నా అన్నారు. ప్రముఖ వన్యజీవి ఫోటో గ్రాఫర్లు హరిసోమశేఖర్, రాబన్ డేరియన్, ఉదయ్‌హెగ్డే, ప్రకాశ్ రామకృష్ణన్‌లు పాల్గొన్నారు.

నేడు కోదండరామాలయంలో విశేష పూజలు


బాగేపల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో బాలరాముడి ప్రతిష్టాపనకు ఏడాది పూర్తైన నేపథ్యంలో పట్టణంలోని ఓల్డ్ ఎస్‌బిఎం రోడ్డులోని కోదండ రామస్వామి ఆలయంలో బుధవారం విశేషపూజలు నిర్వహించనున్నారు. గోపూజ, అనంతరం స్వామివారికి పంచామృతాభిషేకం, శ్రీరామతారక హోమం, విశేషపూజలు, సాయంత్రం భజన, దీపోత్సవం ఉంటాయని ఆలయ సేవా సమితి ముఖ్యులు డాక్టర్ రవీంద్ర తెలిపారు. మంగళవారం స్వామివారికి విశేషపూజలు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలందరూ ఉత్సవంలో పాల్గొనాలని కోరారు. రామనామ సంకీర్తన, కోలాటం, చెక్క భజన తదితర కార్య క్రమాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా ఆలయ సమితి సభ్యులు శ్రీనివాస రెడ్డి, నరసింహప్ప, బదరినాథ, వెంకటరామ్, అర్చకులు రఘునంద తదితరులు పాల్గొన్నారు.



ఆలయ సమితి పదాధికారులు

అత్యాచారం కేసులో ఇద్దరు కూలీల అరెస్టు

బెంగళూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కేఆర్ మార్కెట్‌లో బస్సుకోసం వేచియున్న మహిళను దారి చూపుతామని గోడౌన్‌వైపు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడిన సంఘటనలో ఇద్దరు కూలీలు అరెస్టు చేసినట్టు సెంట్రల్ మహిళా పోలీసులు ప్రకటించారు. కేఆర్ మార్కెట్‌లో కూలి పనిచేసే గణేశ్ (23), శరవణ (35)లను అరెస్టు చేశారు. ఈనెల 19న ఆదివారం రాత్రి 11.30గంటలకు బస్సు కోసం వేచియున్న తమిళనాడు మహిళను దారితప్పించి గోడౌన్ స్ట్రీట్‌కు తీసుకెళ్లి సీసీకెమెరాలు లేనిచోట దారుణానికి పాల్పడ్డారు. ఆమెనుంచి 650 నగదు, తాళిబొట్టు, కమ్మలు, కాలిగజ్జెలతోపాటు మొబైల్‌ను దోచుకుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు వెంటనే స్పందించి ఇరువురిని అరెస్టు చేశారు. భర్తతో గొడవపడి నగరానికి వచ్చిన మహిళ యలహంకలోని సోదరుడి ఇంటికి వెళ్లేందుకు బస్సుకోసం వేచియుండగా దుండగులు దారుణానికి పాల్పడ్డారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1620.63	1,588.88
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	11.239	0
నీటి నిల్వ (టీఎంసీలు)	63.11	10.12

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బళ్లారి గాంధీనగర్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): బళ్ళారి నగరంలోని జెస్కాం ఉప విభాగం 1 పరిధిలోకి వచ్చే 220/11 కెవి అల్లిపురం సబ్‌స్టేషన్‌లో త్రైమాసిక నిర్వహణ పనులు చేబడుతున్న కారణంగా బుధవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం వరకు ఫీడర్ నెంబర్ 34, 36,30, 75, 76, 77 ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిస్తున్నట్లు జెస్కాం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా వినాయక నగర్, కంటోన్మెంట్, ఐశ్వర్య కాలనీ, ఐటీఐ కళాశాల, రేడియో పార్కు, కౌల్ బజార్, టైలర్ వీధి, కువెంపు నగర్, జయనగర, చంద్ర కాలనీ, రామాంజనేయ నగర్, సీఎంసీ కాలనీ, ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీ, ఫారెస్ట్ క్వార్టర్స్ జాగృతి నగర్, ట్రామా కేర్ సెంటర్, వాటర్ బూస్టర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిస్తున్నట్లు, వినియోగదారులు సహకరించాలని ఒక ప్రకటనలో తెలిపారు.

పరిశ్రమలపై అవగాహన తప్పనిసరి

● పంచాయతీ ఈఓ పవన్‌కుమార్

సిరుగుప్ప, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలపై అవగాహన తప్పనిసరి అని తాలుకా పంచాయతీ ఈఓ పవన్‌కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని తాలుకా పంచాయతీ భవనంలో పరిశ్రమల శాఖ తాలుకా పంచాయతీ జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో పరిశ్రమల అభివృద్ధిపై మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈఓ పవన్‌కుమార్ మాట్లాడుతూ నేటి రోజుల్లో వైజ్ఞానికంగా భారత్ ముందడుగు వేయాలంటే ఆధునిక పరిజ్ఞానం తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో తాలుకా పంచాయతీ మేనేజర్ బసవరాజు, పరిశ్రమల శాఖ అధికారులు, సార్వజనికులు పాల్గొన్నారు.

గోశాల తొలగింపు

●మలియాబాద్‌కు ఆవుల తరలింపు



గోశాల షెడ్డును తొలగిస్తున్న పాలికె సిబ్బంది

రాయచూరు జనవరి 21(ఆంధ్రజ్యోతి): నగర సమీపంలోని ఏగనూరు వద్ద ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించుకున్న గోశాలను మంగళవారం రాయచూరు మహానగర పాలికె అధికారులు తొలగించారు. మృత్యుంజయ స్వామి అనే వ్యక్తి ప్రభుత్వ స్థలం సర్వే నెంబర్ 202లో స్థలాన్ని ఆక్రమించి షెడ్లు ఏర్పాటు చేసే గోశాల నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో అధికారులు తొలగింపు చర్యలు చేపట్టారు. మహానగర పాలికె పరిధిలోకి వచ్చిన ఏగనూరు శివారులో వెలసిన షెడ్లను కమిషనర్ గురుసిద్ధయ్య హిరేమఠ ఇతర అధికారులు పోలీసుల సహాయంతో తొలగించారు. అక్కడ ఉన్న గోవులను నగర సమీపంలోని మలియాబాద్ గోశాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు.

సిరి ధాన్యాల సాగుకు ముందుకు రావాలి

● రైతులకు జిల్లా అధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా సూచన ● ఆహార అలవాట్లతోనే అధిక రోగాలు: మేయర్ నందీష్ కుమార్



మేళాను ప్రారంభిస్తున్న డీసీ ప్రశాంత్ కుమార్ , మేయర్ నందీష్ కుమార్

బళ్లారి గాంధీనగర్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): సిరిధాన్యాలతో ఉత్తమమైె ఆరోగ్యం సాధ్యమని, సాగుపై రైతులు ఆసక్తి చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా అధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా పాలనా మండలి, జిల్లా పంచాయతీ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నగరంలోని మున్సిపల్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సిరిధాన్యాల ఉత్సవ కార్యాక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితి మార్పుల కారణంగా సరైన సమయంలో వర్షాలు కురవని కారణంగా రైతులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోందన్నారు. తుంగభద్ర ఆయకట్టు రైతు లు, వరి, మిరప పత్తి లాంటి వాణిజ్య పంటల సాగుపైనే దృష్టి సారిస్తున్నారని, అలా కాకుండా వాణిజ్య పంటలతో పాటు సిరిధాన్యాలు పంట సాగుపై రైతులు దృష్టి సారించాలని, అందుకు అవసరమైన సలహాలు, సూచనలు జిల్లా వ్యవసాయ శాఖ రైతులకు అందజేయాలని అధికారులను సూచించారు. ప్రస్తుతం రోజుల్లో సిరి ధాన్యాలకు నగరాల్లో మంచి డిమాండ్ ఉందని, ఆధునిక ఆహారపు అలవాట్లకు అలవాటు పడిన నగర వాసులు ఇపుడిపుడే సిరిధాన్యాలపై మొగ్గు చూపుతున్నారన్నారు. రైతులు కూడా సిరిధాన్యాలు పండించడం ద్వారా అధిక లాభాలు సాధించవచ్చన్నారు. సిటీ మేయర్ ముల్లంగి నందీష్ మాట్లాడుతూ మన పూర్వికులు ఎక్కువగా సిరిధాన్యాలు ఆహారంగా సేవించడం ద్వారా ఎంతో ధృడంగా ఆరోగ్యంగా ఉన్నారని, ప్రస్తుతం మన తరం సిరి ధన్యాలకు బదులుగా ఆధునిక ఆహారపు అలవాటు చేసుకున్న కారణంగా లేనిపోని అనారోగ్య సమస్యలు కొని తెచ్చుకుంటున్నట్లు అయ్యిందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా పంచాయతీ సీఈఓ శరణప్ప సంకనూరు మాట్లాడుతూ, 2023 సంవత్సరాన్ని సిరి ధాన్యాల సంవత్సరంగా ప్రభుత్వం ప్రకటించిందని, సిరిధాన్యాల మహత్యాన్ని ప్రజలు తెలుసుకోవాలన్నారు. సిరిధాన్యాలు సేవించడం ద్వారా ఆరోగ్య సమతూలనం చేసుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ మాట్లాడుతూ దేశంలో 142 కోట్లమంది జనసంఖ్య ఉండగా, 332 మిలియన్ టన్నుల మాత్రమే ఆహార ఉత్పాదన జరుగుతోందని, వచ్చే ఐదేళ్ళ వరకు ప్రతి ఒక్కరికి ఆహారం లభించే అవకాశం ఉన్నా... పోషకాంశాలతో కూడిన ఆహారం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిరి అంటే సంపదని, అలాంటి సిరి ధాన్యాలైన కొర్రలు, రాగులు, సజ్జలు పౌష్టికాంశాలు ఎక్కువగా ఉంటాయనాన్నారు. సిరిధాన్యాలు ఎక్కువగా ఆహార పదార్థాలుగా తీసుకోవడం ద్వారా రక్తపీడం, హృదయ సంబంధిత వ్యాధుల నుండి దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనతో పాటు వ్యవసాయానికి ఉపయోగ పడే పరికరాలు ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కృషి సమాజ ఉపాధ్యక్షులు ఎస్.కె.విశాలాక్షి, రాష్ట్ర ప్రతినిధి కృషిక సమాజం సురేష్ నంది, అసిస్టెంట్ జాయింట్ డైరెక్టర్ మంజునాథ్, వ్యవసాయ అధికారి దయానందలతో పాటు జిల్లా ప్రజా ప్రతినిధులు, రైతులు, రైతు సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. సుమారు 40 స్టాల్స్ వరకు ఏర్పాటు చేశారు.



స్టాళ్లను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

గర్భిణులు వైద్యుల సలహాలు పాటించాలి: డీహెచ్‌ఓ



ఆసుపత్రుల్లో గర్భిణులతో మాట్లాడుతున్న డీ హెచ్‌ఓ రమేష్ బాబు

బళ్లారి సిటీ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణుల ప్రసవానికి మూడు రోజుల ముందు నుంచే వైద్యులు పర్యవేక్షణలో ఉండాలని, సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి రమేశ్‌బాబు తెలిపారు. మంగళవారం జిల్లా ఆసుపత్రిలో ఆయన వార్డుల్లో సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడుతూ ప్రసనానికి ముందు అన్ని పరీక్షలు నిర్వహించాలని, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రమాదకరమైన పరిస్థితి వాటిల్లితే తక్షణమే చికిత్స అందించాలన్నారు. వైద్యుల సలహా ప్రకారం రక్తహీనత స్థాయి తీవ్రంగా ఉంటే రోజుకు కనీసం 180 మాత్రలు ఉచిత ఐరన్ మాత్రలు తీసుకోవాలని, 6నెలల వ్యవధిలో 360 మాత్రలు రోజుకు రెండు సార్లు తీసుకోవడంతో పాటు కాల్షియం మాత్రలు తీసుకో వాలన్నారు. ఈసందర్భంగా జిల్లా సర్జన్ బసారెడ్డి, డీఎంఓ బళ్లారి తాలూకా ఆరోగ్య అధికారి డా.అబ్దుల్లా, జిల్లా లెప్రసీ కంట్రోల్ అధికారి వీరేంద్రకుమార్, డా. జయప్రద, డా.శ్రీలక్ష్మి, జిల్లా ఆరోగ్యవిద్యాశాఖాధికారి ఈశ్వర్ దాసప్పనవర్, విమలాక్షి, మాలతి, సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర



పాదయాత్రగా బయల్దేరుతున్న మాలధారులు

కంప్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షుగర్ ఫ్యాక్టరీ నుంచి తిరుపతికి వెంకటేశ్వర స్వామి మాలధారులు మంగళవారం తెల్లవారుజామునన పాదయాత్రగా బయల్దేరారు. అంతకుముందు మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫిబ్రవరి 2 లేదా 3వ తేదీన తిరుపతికు చేరుకుంటామని వారు తెలిపారు. ఇలా పాదయాత్రగా తిరుమలకు వెళ్లడం నాల్గవ సారి అని తెలిపారు.

ఏటీఎంను సద్వినియోగం చేసుకోండి

కంప్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని నెల్లూడి కొట్టాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏటీఎంను సద్వినియోగం చేసుకోవాలని బ్రాంచ్ మేనేజర్ వెంకటేష్ తెలిపారు. మంగళవారం ఏటీఎంను ప్రారంభించిన ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బసవ, లక్ష్మన్న, సిబ్బంది, నెల్లూడి గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

బావిని మూసేసిన వారిపై కేసు నమోదు

కంప్లి, జనవరి 21(ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని 20వ వార్డు మారుతీనగర్‌లో పురాతన ఆంజనేయస్వామి దేవాలయం వద్ద వున్న పురాతన బావిని మూసివేసిన వారిపై కేసు నమోదు చేశారు. కొందరు వ్యక్తులు ఆ స్థలం తమదంటూ మూసివేయడంతో హెచ్ సంజీవప్ప ఫిర్యాదు మేరకు మనోహర్, సిద్దప్ప, రామన్న, నందప్ప లపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సంజీవప్ప మాట్లాడుతూ ఎంతో కాలానికి ఆలయానికి వచ్చేభక్తాదులు స్నానాలు చేసేందుకు బావి వుండగా ఉన్నఫళంగా ఆ స్థలం తమది అంటూ ఇలా మూసివేయడం సరికాదన్నారు. వెంటనే వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



మూసేసిన బావిని తెరుస్తున్న గ్రామస్థులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దారు గురురాజ్

ఘనంగ అంబిగర చౌడయ్య జయంతి

బళ్లారి గాంధీనగర్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మాట గట్టిదైనా సమసమాజ స్థాపనకు పోరాడిన మహనీయుల్లో అంబిగర జౌడయ్య ఒకరని, వారి ఆశయాలు, ఆదర్శాలు ప్రతి ఒక్కరు పునికి పుచ్చుకోవాలని బళ్లారి తాలూకా తాహసీల్దారు గురురాజ్ పేర్కొన్నారు. జిల్లా పాలనా మండలి, జిల్లా పంచాయతీ, కన్నడ సంస్కృతి శాఖ, సిటీ కార్పొరేషన్ సంయుక్తంగా మంగళవారం డాక్టర్ జోళదరాసి దొడ్డనగౌడ రంగమందిరంలో ఏర్పాటు చేసిన నిజ శరణలు శ్రీ అంబిగర చౌడయ్య జయంత్యుత్సవం నిర్వహించంచారు. జిల్లా శరణ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కేబీ సిద్దలింగప్ప అంబిగర చౌడయ్య ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. అంబిగర చౌడయ్య 12వ శతాబ్దానికి చెందిన బసవణ్ణ అనుయాయులుగా ఉన్నారన్నారు. హావేరి జిల్లా చౌడదానపుర గ్రామంలో 1120 సంవత్సవంలో జన్మించిన చౌడయ్య తదనంతరం వచనకారులుగా ప్రసిద్ధికెక్కారని, పడవ నడపడం ఆయన వృత్తిగా ఉన్నా, అంబిగర చౌడయ్యగా పేరుగాంచారని, సుమారు 279 వచనాలు రచించినట్లు చరిత్ర చెబుతోందన్నారు. కార్యక్రమంలో భాగంగా అంబిగర చౌడయ్య భావచిత్ని నగర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నడ సంస్కృతి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగరాజు, జిల్లా గంగామతస్తుల సంఘం అధ్యక్షుడు బి.మౌలాలి, సమాజ ప్రముఖులు పాల్గొన్నారు.

సిరుగుప్పలో..



ప్రముఖులను సన్మానిస్తున్న అధికారులు

సిరుగుప్ప : అంబిగర చౌడయ్య తత్వ సిద్ధాంతాలను పాటించాలని బీసీ సంక్షేమ శా ఖ డైరెక్టర్ గాదెలింగప్ప పిలుపునిచ్చారు. మంగళవారం సిరుగుప్ప పట్టణం తాలుకా పంచాయతీ భవనంలో అంబిగర చౌడయ్య 715వ జయంతివేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో గాదెలింగప్ప మాట్లాడుతూ అంబిగరచౌడయ్య వేలాది వచన సాహిత్యాలను రాశారన్నారు. ఈఓ పవన్‌కుమార్, ఉపన్యాసకులు మంజునాథను సన్మానించారు. తాలుకా సాంఘీక సంక్షేమ శాఖ డైరెక్టర్ చిత్తయ్య, డిప్యూటీ తహసీల్దార్ సత్యమ్మ, గంగ మతస్తుల సంఘం అధ్యక్షుడు మారెన్న పాల్గొన్నారు.

రాయచూరులో..



అంబిగర చౌడయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధికారులు

రాయచూరు : నిజ శరణుడిగా ఖ్యాతిగాంచిన అంబిగర చౌడయ్య జయంతిని నగరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అధికారికంగా నిర్వహించిన జయంతి కార్యక్రమంలో సమాజం ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని స్థానిక బీఆర్‌బీ సర్కిల్ వద్దగల చౌడయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, మహానగర పాలికె, కన్నడ మరియు సాంస్కృతాక శాఖ,జిల్లా గంగామతస్థ సమాజం సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా ప్రముఖులు, అధికారులు తదితర ప్రముఖులు పూలమాలలు వేసి అనంతరం చౌడయ్య చిత్రపటాన్ని నగర ప్రధాన రహదారుల గుండా ఊరేగించారు. ఊరేగింపులో సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటీల్, నగరసభ సభ్యుడు కేఎస్ నాగరాజ్, బాబురావ్, దండప్ప బిరాదార్, సయ్యద్ ముక్తియార్, రామచంద్ర కడగోళ తదితరులు పాల్గొన్నారు.

గంగమత సమాజం ఆధ్వర్యంలో..



జ్యోతిని వెలిగిస్తున్న గంగమత జిల్లా అధ్యక్షుడు శాంతప్ప

నిజ శరణుడిగా ఖ్యాతిగాంచిన అంబిగర చౌడయ్య జయంతిని పురస్కరించుకొని మంగళవారం నగరంలో స్థానిక రంగమందిరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాన్ని గంగామతస్థ క్షేమాభివృద్ధి సమాజం అధ్యక్షుడు కే శాంతప్ప జ్యోతి వెలగించి ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధికారి నితీశ్ మాట్లాడుతూ చౌడయ్య వంటి మహనీయుల మార్గ దర్శకత్వం నేటి సమాజానికి అత్యవసరమని, ఆయన చూసిన మార్గంలో పయనించడం ద్వార ఉత్తమ సమాజ స్థాపన సాధ్యమని అభిప్రాయపడ్డారు. సమాజాన్ని సన్మార్గంలో నడిపేందుకు అవిరళ కృషి కల్పిన చౌడయ్య వంటి మహనీయులను స్మరించడం విధిగా భావించాలన్నారు. ఉన్నత నీతి, నైతిక విలువలు, సత్య వాక్కు వంటి సద్గుణాలను సమాజానికి నేర్పించిన అంబిగర చౌడయ్య జయంతిని అధికారికంగా నిర్వహించడం పట్ల ప్రభుత్వాన్ని అభినందించారు. జిల్లా యంత్రాంగం, జడ్పీ,మహానగర పాలిక, కన్నడ మరియు సాంస్కృతిక శాఖ, జిల్లా గంగామతస్థుల సమాజం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో మహానగర పాలిక అధ్యక్షురాలు నరసమ్మ, మాడగిరి, కే శరణప్ప కడగోళు, ఆంజనేయ, శివరాజ్, శివరామ్, రాజ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కంప్లిలో..



కంప్లి మున్సిపల్ కార్యాలయంలో ..

కంప్లి: పట్టణంలో అంబిగరచౌడయ్య జయంతి కనుల పండువగా జరిగింది. మంగళవారం ఉదయం గంగమాత సమాజ ప్రముఖులు బైకు ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అంబిగరచౌడయ్య చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేపట్టారు. పురసభ కార్యాలయంలో, కంప్లి కోటె వివేకానంద పాఠశాలలో జయంతిని నిర్వహించారు.



స్వామి వివేకానంద పాఠశాలలో ..

హోసూరు జోన్



వైరస్ సోకిన రోజా పూలు

డౌనీ వైరస్‌తో తగ్గిన రోజా దిగుబడి

హోసూరు జనవరి 21(ఆంధ్రజ్యోతి): తమిళనాడు సరిహద్దు పట్టణమైన హోసూరుతో పాటు చుట్టుప్రక్కల ప్రాంతాలైన డెంకణీకోట, శూలగిరి, తళి ప్రాంతాల్లో 2.500 ఎకరాలో గులాబీ సాగు చేస్తున్నారు. గ్రీన్‌హౌస్‌లలో తాజ్‌మహల్, ఫస్టరెడ్, నోబెల్స్, కార్వెట్, గోల్డ్‌స్ట్రైక్ సహా గులాబీ, బర్బరా, క్రిసాన్తిమం, కార్నేషన్ వంటి రకాలు పండిస్తున్నారు. హోసూరు పరిసర ప్రాంతాల్లో నవంబరు నుంచి గులాబీ మొక్కలకు డౌనియా వైరస్ కారణంగా సగానికి పైగా దిగుబడి తగ్గింది. స్థానిక మార్కెట్‌లో ప్రస్తుతం గులాబీ ధర పెరుగుతోంది. రైతు హరీష్ మాట్లాడుతూ దేశంల్లో పుణే, నాసిక్‌ల తర్వాత కర్ణాటకలోని దొడ్డబళ్ళాపుర, చిక్కబళ్లాపుర్, కోలార్ ప్రాంతాలు, తమిళనాడు సరిహద్దులోని హోసూరు పరిసర ప్రాంతాల్లో గులాబీలను ఎక్కువగా పండిస్తున్నారు. కాబట్టి సింగపూర్, మలేషియా అని విదేశాలకు ఎగుమతి చేస్తున్న తరుణంలో డౌనీ అనే వైరస్ సోకడంతో తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొంది.



రోడ్లను పరిశీలిస్తున్న అధికారులు

మట్టి రోడ్లను బాగు చేయాలని వినతి

హోసూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలోని 22 వ వార్డులోని మట్టిరోడ్లను తారురోడ్డుగా మార్చాలని స్థానికులు కోరారు. వార్డు సమస్యలపై కౌన్సిలర్, ప్రజారోగ్య కమిటీ అధ్యక్షులు మాదేశ్వరన్, కమిషనర్ శ్రీకాంత్‌లకు వినతి ఇచ్చారు. గ్రంథాలయం, పార్కు, క్రీడా మైదానం, పట్టణ సంక్షేమ కేంద్రం, పన్నుల వసూళ్ల కేంద్రం ఏర్పాటు చేయాలని వినతిలో పేర్కొన్నారు. పదేళ్లకుపైగా ఉన్న సమస్యలను ప్రస్తావించారు. ఈ మేరకు మంగళవారం ఉదయం వార్డులోని పూంచోలైనగర్, న్యూతేజస్‌నగర్, మునీశ్వరనగర్, కృష్ణప్పగార్డెన్, ప్రాంతాలను పబ్లిక్ హెల్త్ కమిటీ చైర్మెన్ మాదేశ్వరన్ పరిశీలించారు. కమిషనర్ శ్రీకాంత్ మునీశ్వర్ నగర్‌లో అర్బన్ వెల్ఫేర్ సెంటర్ ఏర్పాటుకు స్థలాన్ని, పన్ను వసూళ్ల కేంద్రం, న్యూ తేజస్ నగర్‌లో లైబ్రరీ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. మునీశ్వర నగర్‌లోని అర్జున వార్డు గ్రహీత బ్యాడ్మింటన్ క్రీడాకారిణి నిత్యశ్రీ ఇంటిని కమీషనర్ శ్రీకాంత్ సందర్శించారు. అక్కడ తండ్రితో మాట్లాడారు. విద్యార్థుల సౌకర్యార్థం తారురోడ్లు నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రభాకరన్, మునీశ్వర నగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాశ్, కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

మైక్రో ఫైనాన్స్ వేధింపులకు అడ్డుకట్ట వేయాలి

●జన సేవా ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జావిద్ ఖాన్

రాయచూరు జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రుణాల వసూళ్ల పేరుతో మైక్రో ఫైనాన్స్ కంపెనీలు సాగిస్తున్న దౌర్జాన్యాలకు జిల్లా యంత్రాంగం అడ్డుకట్ట వేయాలని జనసేవా ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జావిద్ ఖాన్ కోరారు. ఈ నెల 24వ తేదీలోగా ఉన్నతాధికారులు మైక్రో ఫైనాన్స్‌లకు తక్షణ ఆదేశాలు ఇవ్వకపోతే తమ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాధికారి కార్యాలయం ముందు సత్యాగ్రహాలు చేపడుతామని హెచ్చరించారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయన మైక్రో ఫైనాన్స్ కంపెనీలు నిబంధనలకు విరుద్ధంగా చక్రవడ్డీ విధిస్తూ రుణాల వసూళ్ల కోసం మహిళలను వేదింపులకు గురి చేస్తున్నట్లు ఆరోపించారు. గత కొంతకాలంగా జిల్లాలో పెద్ద ఎత్తున ఇలాంటి వేదింపులు సాగుతున్నా సంబంధిత శాఖల అధికారులకు బాధితులు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు స్పందించకపోవడం బాధ్యత రాహిత్యమన్నారు. పలు సందర్భాల్లో మహిళలు మైక్రో ఫైనాన్స్ కంపెనీల వేధింపులు, అవమానాలు భరించలేక ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనలు కూడా జిల్లాలో చోటు చేసుకున్నాయన్నారు. అధికారులు వీటికి అడ్డుకట్ట వేయకపోతే బాధితులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న జావిద్ ఖాన్

నగల దుకాణంలో చోరీ

హోసూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): హోసూరు బాగలూరులోని నగల దుకాణంలో చోరీ జరిగింది. రామ్‌లాల్‌కు చెందిన నగల దుకాణం లో ఈనెల 19వ తేది మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇద్దరు మహిళలు, ఒక యువకుడు ముగ్గురు వ్యక్తులు వచ్చారు. తమకు కావాల్సిన నగలు కొనుగోలు చేసి డబ్బులు చెల్లించి వెళ్లిపోయారు. ఎప్పటిలాగే రాత్రి దుకాణంలోని నగలు తనిఖీ చేయగా 36 గ్రాముల బంగారు ఆభరణ ం మాయమైనట్లు గుర్తించి అవాక్కయ్యారు. ఆ తర్వాత షాపులోని సీసీ కెమరాను పరిశీలించగా ఆభరణాలు కొనేందుకు వచ్చిన ఇద్దరు మహిళలు, ఓ వ్యక్తి ఆభరణాలు చూపించే సమయంల్లో మరో మోడల్స్ కావాలంటూ దుకాణ సిబ్బంది దృష్టిని మరల్చారు. వచ్చిన ఆ ముగ్గురు తేలికైన నగలను తీసుకుని 36 గ్రాముల బంగారు నగలను సంచిలో ఉంచినట్టు గుర్తించారు. దుకాణ యజమాని బాగలూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.